# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక


సంపుటి :12 సంచిక :332 మంగళవారం 4-8-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/





## ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై నిఘా వేసిన చైనా..!

- సొంత పౌరులతో పాటు విదేశీయులపైనా పర్యవేక్షణ
- పాస్‌పోర్టు, ఫోన్ నంబర్ల నుంచి ప్రయాణాల వరకు నమోదు
- రహస్య వెబ్‌సైట్‌లో బయటపడిన నిఘా వ్యవస్థ
- భారత్, పాక్ పౌరుల వివరాలు అధికంగా గుర్తింపు
- కెమెరాలు, మొబైల్ సిగ్నల్స్‌తో కదలికల ట్రాకింగ్
- స్వదేశాలకు వెళ్లినా కొనసాగుతున్న చైనా నిఘా
- విమానాలు, రైళ్ల వివరాలూ డేటాలో భద్రం
- సైబర్ పరిశోధకుడి ద్వారా వెలుగులోకి వచ్చిన రహస్యాలు
- వెబ్‌సైట్ అదృశ్యం.. చైనా నుంచి స్పందన కరువు

ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందికిపైగా ప్రజలపై చైనా నిఘా పెట్టినట్లు అమెరికాకు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. సొంత పౌరులతో పాటు చైనాను సందర్శించిన విదేశీయుల పాస్‌పోర్టు, ఫోన్ నంబర్లు, ప్రయాణ వివరాలు, కదలికల సమాచారాన్ని సేకరించి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. సైబర్ భద్రతా పరిశోధకుడు మార్క్ హోఫర్ గుర్తించిన రహస్య వెబ్‌సైట్‌లో ఈ వివరాలు బయటపడినట్లు తెలిపింది. భారత్, పాకిస్థాన్ సహా పలు దేశాల పౌరుల సమాచారం ఇందులో ఉన్నట్లు వెల్లడించింది. కెమెరాలు, మొబైల్ సిగ్నల్స్ ద్వారా కదలికలను ట్రాక్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కథనంపై చైనా నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.



02



## ఈ-20పై నేడు మోదీ ఇంటికి మార్చ్..

- వంద మందితో కలిసి పిటిషన్లు అందజేస్తానన్న కేజ్రీవాల్
- మైలేజీ తగ్గి, ఇంజిన్ సమస్యలు వస్తున్నాయని ఆరోపణ
- 2023కు ముందు వాహనాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్న వ్యాఖ్య
- ప్యూర్ పెట్రోల్‌తో పాటు ఈ-5, ఈ-10 విక్రయించాలని డిమాండ్
- ఇథనాల్ కొనుగోళ్లపై కేంద్రం వైఖరిని ప్రశ్నించిన ఆప్ అధినేత
- ఈ-20 ధరలు ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువగా ఉన్నాయన్న విమర్శ
- 2 లక్షలకుపైగా వాహనదారుల సంతకాలతో పిటిషన్ సమర్పిస్తామని వెల్లడి

02



## మోడీ--షాలకు ఇక ఇంటి దారే

- బంకిపూర్ తీర్పుతో బీజేపీ అహంకారానికి గట్టి ఎదురుదెబ్బ
- బీజేపీ కంచెకోటలో కాంగ్రెస్ విజయం దేశ రాజకీయాలకు సంకేతం
- బంకిపూర్ ప్రజలు గుణపాఠం చెప్పారని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య

బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నిక ఫలితం దేశ రాజకీయాల్లో కీలకమైన మార్పునకు సంకేతమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీకి దశాబ్దాలుగా కంచెకోటగా ఉన్న బంకిపూర్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పు అధికార అహంకారానికి గట్టి ఎదురుదెబ్బ అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఖాళీ అయిన ఈ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం సాధారణ విషయం కాదన్నారు. కేంద్రంలోనూ, బీహార్‌లోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం, సామాజిక విభజన రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని మహేష్ కుమార్

-మిగతా 2 లో

### మోసానికి కేరాఫ్ అడ్రస్

# బీఆర్ఎస్

– పెద్ది సుదర్శన్ రెడ్డిని మోసం చేసింది బీఆర్ఎస్సే

- పెద్ది సుదర్శన్ రెడ్డి బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేశారు
- చనిపోయాక రాజకీయాల కోసం వాడుకుంటున్న కేటీఆర్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి






హైదరాబాద్ ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) : పదేండ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించింది బీఆర్ఎస్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు అని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల

-మిగతా 2 లో



## సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య పెంపు

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంచే బిల్లు
- బిల్లుకు ఆమోదం తెలిపిన లోక్‌సభ
- భారతీయ గణాంక సంస్థ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) : దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే

-మిగతా 2 లో



## రోడ్డుంటే.. ఫుట్‌పాత్ ఉండాల్సిందే!..

- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రానికి సూచన
- రెండు వారాల్లో కార్యాచరణ చేపట్టాలని గడువు

02



## త్వరలో పాలమూరుకు పర్యావరణ అనుమతులు

- పోలవరం బ్యాక్‌వాటర్‌పై శాస్త్రీయ అధ్యయనం
- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత :
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్‌ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) : పాలమూరు--రంగారెడ్డితో పాటు సీతారామ, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులను ఆరు నెలల్లో సాధించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త ద్వారాలను తెరిచిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రతిపాదనలను వేగంగా

-మిగతా 2 లో

### బీహార్‌లో బీజేపీ కంచుకోట

# బద్దలు

### 3 దశాబ్దాలుగా ఓటమెరుగని చోట ఘోర పరాజయం



**19 వేల పైచిలుకు మెజారిటీతో ఘన విజయం**

- బాంకీపుర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్ గెలుపు
- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు దిమ్మతిరిగే షాక్
- మూడుచోట్ల బైపోల్.. బీజేపీకి దక్కింది ఒక్కటే
- మధ్యప్రదేశ్ దతియాలోనూ కమలం పరాజయం
- గుజరాత్ మంజల్‌పూర్‌లో పడిపోయిన మెజారిటీ
- జెన్‌జీ నిరసనల ప్రభావమేనంటున్న విశ్లేషకులు

పాట్నా,ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) : బీహార్‌లో బీజేపీ కంచుకోట బద్దలైంది. బాంకీపుర్ అసెంబ్లీ ఉపఎన్నికలో జన్ సురాజ్ వ్యవస్థాపకుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ చరిత్ర సృష్టించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను 19,324 ఓట్ల తేడాతో ఓడించి తన పార్టీకి ఆయన తొలి ఎన్నికల విజయాన్ని అందించారు. బీహార్‌లో 30 ఏండ్లకు పైగా కమలం పార్టీ కంచుకోటగా నిలిచిన బాంకీపుర్ అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకుని తన మొదటి ఎన్నికలోనే బీజేపీకి

-మిగతా 2 లో




## పొరపాట్లకు తావులేకుండా 'సర్' డిజిటలైజేషన్

- తప్పిదాలను రోల్‌బ్యాక్ సాయంతో సవరించాలి :
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్‌ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) : రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సర్ ప్రక్రియపై అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోలు లేకపోవడం, జన్మతేదీ వ్యత్యాసాలు, లింగ వివరాల్లో పొరపాట్లు, సంతకాల్లో లోపాలను సరి చేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. గైర్హాజరు, నివాసం మార్పు, మరణించిన, నకిలీ (ఏఎస్‌డీడీ) ఓటర్ల జాబితాల పునఃపరిశీలన, విశ్లేషణ, మ్యాపింగ్ కాపోవడం తదితర అంశాలను సమగ్రంగా

-మిగతా 2 లో

## మోడీ--షాలకు ఇక ఇంటి దారే

మొదటి తరువాయి

గౌడ్ అన్నారు. ఎంత బలమైన రాజకీయ కోట అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని బంకిపూర్ మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. ప్రచారాలతో కాదు, ప్రజలకు ఫలితాలిచ్చే పాలనతోనే విశ్వాసాన్ని గెలుచుకోవాలని ఈ తీర్పు స్పష్టం చేస్తోందన్నారు. దేశ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ వైపు ఆశగా చూస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్న ఆయన, బంకిపూర్ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం ఎప్పుడూ ప్రజలదేనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## మోసానికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్

మొదటి తరువాయి

కోసం వాడుకోవడం... అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం...కల్వకుంట్ల కుటుంబానికి వెన్నుతో పెట్టిన విద్య అని అన్నారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం అని ఆయన అన్నారు.

## ఈ-20పై నేడు మోదీ ఇంటికి మార్చ్..

- వంద మందితో కలిసి పిటిషన్లు అందజేస్తానన్న కేజ్రీవాల్
- మైలేజీ తగ్గి, ఇంజిన్ సమస్యలు వస్తున్నాయని ఆరోపణ
- 2023కు ముందు వాహనాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్న వ్యాఖ్య
- ప్యూర్ పెట్రోల్‌తో పాటు ఈ-5, ఈ-10 విక్రయించాలని డిమాండ్
- ఇథనాల్ కొనుగోళ్లపై కేంద్రం వైఖరిని ప్రశ్నించిన ఆప్ అధినేత
- ఈ-20 ధరలు ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువగా ఉన్నాయన్న విమర్శ
- 2 లక్షలకుపైగా వాహనదారుల సంతకాలతో పిటిషన్ సమర్పిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ

ఈ-20 పెట్రోల్‌పై నేడు ప్రధాని నరేంద్ర మోదీ ఇంటికి వంద మందితో మార్చ్ నిర్వహించి పిటిషన్లు అందజేస్తానని ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'దేశంలో ఈ-20 పెట్రోల్ అమ్మడం వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మైలేజీ తగ్గిపోవడం, ఇంజిన్‌లో రిపేర్లు వస్తున్నాయి. 2023 కంటే ముందు వాహనాల ఓనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ-20ని కేంద్రం కొనసాగించడం వెనక రహస్య ఎజెండా ఉంది.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి వల్లే యూఎస్ నుంచి భారత్ ఇథనాల్ కొంటున్నది. నేను లేఖ రాసినా మోదీ స్పందించలేదు. అందుకే ఆయన ఇంటికెళ్లి ఫిర్యాదు చేస్తా. అన్ని పెట్రోల్ బంకుల్లో ప్యూర్ పెట్రోల్ తో పాటు ఈ-5, ఈ-10 పెట్రోల్ కూడా అమ్మాలన్నదే మా డిమాండ్' అని కేజ్రీవాల్ తెలిపారు. ఈ-20 పెట్రోల్ ధరలు తక్కువగా ఉండాల్సింది పోయి ఇతర దేశాలలో దొరుకుతున్న ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు.తాను మోదీకి ఇవ్వబోయే పిటిషన్లపై 2లక్షల మందికి పైగా వాహనదారులు సంతకం చేశారని.. దీన్ని బట్టి ఇథనాల్ పెట్రోల్ మీద ఉన్న వ్యతిరేకతను గ్రహించాలని కేజ్రీవాల్ కోరారు.

## రోడ్డుంటే.. ఫుట్‌పాత్ ఉండాల్సిందే!..

- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రానికి సూచన
- రెండు వారాల్లో కార్యాచరణ చేపట్టాలని గడువు



న్యూఢిల్లీ

దేశంలోని ప్రతి రోడ్డుపై పాదచారుల కోసం ప్రత్యేక మార్గం ఉండేలా చూడాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఓ రోడ్డు ప్రమాదం కేసుపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు సూచించింది. 'పెద్దగా పెట్టుబడి, నిర్మాణాల అవసరం లేకుండానే పాదచారుల కోసం కేటాయించిన స్థలాన్ని ప్రత్యేకంగా గుర్తించండి.ఎక్కడ రోడ్డు ఉంటే.. అక్కడ పాదచారుల కోసం ప్రత్యేక ప్రదేశం ఉండాలి. అది తాడుతోనైనా లేక ఇంకా ఏ విధంగానైనా సరే రోడ్డుపై పాదచారులకు ప్రత్యేక మార్గం ఉండాలి, ఆ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేసేందుకు కేంద్ర సర్కార్‌కు రెండు వారాల గడువునిచ్చింది.

## పొరపాట్లకు తావులేకుండా 'సర్' డిజిటలైజేషన్

మొదటి తరువాయి

పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించకూడదని స్పష్టం చేశారు. లోపాలు గుర్తించిన సందర్భంలో రోల్‌బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి అవసరమైన సవరణలు చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ), బూత్ లెవల్ సూపర్వైజర్లు (బీఎల్ఎస్), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓ) క్షేత్ర స్థాయిలో నిబద్ధతతో పని చేయా లన్నారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సమా వేశాల మినిట్స్‌ను, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలతో సిద్ధం చేసి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 85 సంవత్సరాల వయస్సు గల ఓటర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సాధారణ పరిపాలన శాఖ అదనపు కార్యదర్శి ఎన్. శంకర్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జిఎస్. చారి, జీహెచ్ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై నిఘా వేసిన చైనా..!

- సొంత పౌరులతో పాటు విదేశీయులపైనా పర్యవేక్షణ
- పాస్‌పోర్టు, ఫోన్ నంబర్ల నుంచి ప్రయాణాల వరకు నమోదు
- రహస్య వెబ్‌సైట్‌లో బయటపడిన నిఘా వ్యవస్థ
- భారత్, పాక్ పౌరుల వివరాలు అధికంగా గుర్తింపు
- కెమెరాలు, మొబైల్ సిగ్నల్స్‌తో కదలికల ట్రాకింగ్
- స్వదేశాలకు వెళ్లినా కొనసాగుతున్న చైనా నిఘా
- విమానాలు, రైళ్ల వివరాలూ డేటాలో భద్రం
- వెబ్‌సైట్ అదృశ్యం.. చైనా నుంచి స్పందన కరువు



న్యూఢిల్లీ

చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికా కు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా.. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్‌జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం. ఆ వెబ్‌సైట్‌లో వారి వ్యక్తిగత వివరాలు సహా వారు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే సమాచారం నమోదై ఉన్నది. వీరందరినీ చైనా అధికారులు కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. వారందరూ స్వదేశాలకు వెళ్లాక కూడా ఈ నిఘా కొనసాగుతుండడం గమనార్హం. చైనాలోని పోలీస్ విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను విక్రయించే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు కూడా ఈ వెబ్‌సైట్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డేటా అక్కడి పోలీసులకు అందుబాటులో ఉంది. ప్రజలు ఎక్కిన విమానాలు, వారి సీటు నెంబరు, రైళ్ల వివరాలు అందులో అందుబాటులో ఉన్నాయి. 2019లో హాంకాంగ్‌లో భారీ స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగినప్పటి నుంచి అక్కడి ప్రభుత్వం నిఘాను మరింత పెంచింది. దేశ ప్రజల విదేశీ భాగస్వాములపైనా ప్రత్యేక నిఘా ఉంచింది. అయితే ఈ సైట్‌లోని సమాచారమంతా మే నెలలో అదృశ్యం కావడం గమనార్హం. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు మార్క్ హోఫర్ అప్పటికే వెబ్‌సైట్‌లోని డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కథనాలపై చైనా నుంచి ఎటువంటి అధికారిక స్పందన రాలేదు.

## సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య పెంపు

మొదటి తరువాయి

ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం, అయోధ్య రామాలయం లో ధర్మాల విరాళాల చోరీ ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగలేదు. పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం అనంతరం సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లకుండా నినాదాలు కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభల ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని సంక్షిప్తంగా వివరించారు.

**అనేకసార్లు విజ్ఞప్తి చేసినా!**

అయితే స్పీకర్ సభ్యులను పలుమార్లు శాంతించాలని కోరారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, సభా సంప్రదాయాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో చర్చ జరగలేదు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం తీసుకొచ్చిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. ఈ సవరణ బిల్లు ప్రకారం ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అనుమతించిన సంఖ్యను 33 నుంచి 37కు పెంచనున్నారు. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు చేరుతుంది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల సంఖ్య, న్యాయమూర్తులపై అధిక పని భారం, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. గత వారం కూడా జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు విపక్షాల ఆందోళనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది.

**మరో కీలక బిల్లు కూడా!**

ఇదిలా ఉండగా, సోమవారం లోక్‌సభలో మరో కీలక బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్--ఐఎస్ఐ)కు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను కల్పించే భారతీయ గణాంక సంస్థ బిల్లు--2026ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు ద్వారా ప్రస్తుతం 1959 చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. ఐఎస్ఐను బాడీ కార్పొరేట్?గా ఏర్పాటు చేసి పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్య, పరిశోధనా రంగాల్లో ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పరిమాణాత్మక ఆర్థిక శాస్త్రం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దడం బిల్లు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. కొత్త చట్టం ప్రకారం భారత రాష్ట్రపతి ఐఎస్ఐకి విజిటర్‌గా వ్యవహరిస్తారు. సంస్థ నిర్వహణ కోసం ఛైర్మన్ నేతృత్వంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఏర్పాటు చేయనున్నారు.

విద్యా విధానాల రూపకల్పన, పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, జవాబుదారీ తనం వంటి అంశాలకు మరింత స్పష్టమైన చట్టపరమైన రూపురేఖలు కల్పించనున్నారు. అలాగే డైరెక్టర్ నేతృత్వంలో అకాడమిక్ కౌన్సిల్ ఏర్పాటు చేసి పూర్తి కాల అధ్యాపకులను అందులో సభ్యులుగా చేర్చే ప్రతిపాదన కూడా...

## బీహార్‌లో బీజేపీ కంచుకోట బద్దలు..

మొదటి తరువాయి

ఊహించని ఘోర పరాజయాన్ని ఆయన చవిచూపించారు. ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా సిన్హాకు 44,827 ఓట్లు లభించాయి. ఆర్‌జేడీ అభ్యర్థి రేఖా గుప్తా 14,273 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు నుంచే ప్రశాంత్ కిశోర్ ఆధిక్యతను కనబరుస్తూ వచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం, తదనంతరం ఏప్రిల్‌లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవ్వడంతో బాంకీపూర్ బీజేపీ ఎమ్మెల్యే పదవికి నితిన్ నబిన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి నబిన్ తండ్రి దివంగత నవీన్ కిశోర్ సిన్హా, ఆ తర్వాత స్వయంగా నితిన్ నబిన్ బాంకీపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. తద్వారా ఈ స్థానాన్ని బీజేపీకి ఒక కంచు కోటగా మార్చారు. నితిన్ నబిన్, బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి, దాదాపు 40 మంది కేంద్ర, రాష్ట్ర నాయకులతోసహా అధికార ఎన్‌డీయే కూటమి తన సర్వశక్తులను ఒడ్డినప్పటికీ ఘోర పరాజయాన్ని చవిచూడక తప్పలేదు. బాంకీపూర్‌లో ప్రశాంత్ కిశోర్ గెలుపు నితిన్ నబిన్‌తోపాటు బీహార్‌లో తొలి బీజేపీ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరికీ ఇది భారీ ఎదురుదెబ్బగా పరిగణించాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు. తన విజయం ఖాయమని తేలిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రశాంత్ కిశోర్ బాంకీపూర్ ప్రజలు తనపైన ఉంచిన నమ్మకాన్ని కాపాడుకోవడమే తన మొదటి ప్రాధాన్యతని తెలిపారు. బాంకీపూర్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు. రానున్న రెండు, మూడు నెలల్లోనే మార్పును మీరు చూస్తారని ఆయన అన్నారు. బీజేపీ నాయకత్వానికి బాంకీపూర్ ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారని, బీహార్‌కు ఒక మంచి వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించమని ప్రజలు చెబుతున్నారని ఆయన తెలిపారు. 30 ఏండ్ల కంచుకోట 30 రోజుల్లో కూలిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. విద్య, ఉపాధిపై దృష్టి పెట్టే మంచి నాయకత్వం బీహార్‌కు అవసరమని ఆయన చెప్పారు.

## త్వరలో పాలమూరుకు పర్యావరణ అనుమతులు

మొదటి తరువాయి

ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్ది తిరిగి సమర్పించాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి రికార్డులను ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో, దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తనిఖీలు పూర్తి చేయాలని సూచించారు. అనుమతి రాగానే సీతారామ సాగర్ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని ఉత్తమ్ ఆదేశించారు. భూములు, గ్రామాలు, నివాస ప్రాంతాలు, ప్రజా మౌలిక వసతులు, ఇతర ఆస్తులు ఎంతవరకు ముంపుకు గురయ్యే అవకాశం ఉందో నిర్ధారించాలని సూచించారు. బాధితులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని స్పష్టం చేశారు. సమీక్షలో ఈఎన్‌సీలు ఓవీ. రమేష్‌బాబు, పి.శ్రీనివాస్, ఆర్.మధుసూదన్‌రావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**అంతర్రాష్ట్ర విభాగం బలోపేతం....**

సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), కోర్టులు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగా లతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, న్యాయ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాల న్నారు. కోర్టు కేసుల విషయంలో న్యాయ సలహా దారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు

# కర్ణాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు..

**-మంత్రి పదవి ఇవ్వలేదని ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా**



**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
కర్ణాటక క్యాబినెట్ విస్తరణ వేళ అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి చిచ్చు రాజుకుంది. క్యాబినెట్ విస్తరణలో తమకు చోటు దక్క లేదన్న అసంతృప్తితో సోమవారం ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యులు తమ శాసన సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. మంత్రివర్గంలో చోటు దక్కలేదని ఇండీ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వంత్‌రాయగౌడ, సాగర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే బేలూర్ గోపాలకృష్ణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.తనకు మంత్రి పదవి ఇస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో పార్టీ విఫలమైందని పాటిల్ విమర్శించగా మాజీ ముఖ్యమంత్రుల పిల్లలకే కాంగ్రెస్‌లో ప్రాధాన్యత లభిస్తున్నదని గోపాలకృష్ణ ఆరోపించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు డీకే మంత్రివర్గాన్ని విస్తరించారు. క్యాబినెట్‌లో 19 మందికి చోటు కల్పించారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. అసంతృప్త ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై డీకే స్పందిస్తూ, 'ఇంత కుముందు సిద్ధరామయ్య క్యాబి నెట్‌లో నాకూ మంత్రి పదవి దక్కలేదు. అర్హు లైన వారు చాలామంది ఉన్నా..అందరికీ చోటు కల్పించలేం కదా!' అని అన్నారు.

# కావేరీ జలాలపై సుప్రీంకు తమిళనాడు



**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
కావేరీ జలాల వివాదంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(సీడబ్ల్యూఎంఏ), కావేరీ రెగ్యులేషన్ కమిటీ(సీడబ్ల్యూఆర్‌సీ) ఆదేశాలను కర్ణాటక ప్రభుత్వం ఉల్లంఘించిందని, తమకు దక్కాల్సిన నీటిని విడుదల చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ముఖ్యమంత్రి విజయ్ ఆదేశాల మేరకు ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.కర్ణాటకకు తగినంత నీటి లభ్యత ఉన్నప్పటికీ నీటి విడుదలకు నిరాకరించడం తగదని తమిళనాడు పేర్కొంది. తమకు రావాల్సిన కావేరీ జలాలను ఇప్పించాలని కోర్టును అభ్యర్థించింది

# రేపు జంతర్ మంతర్‌లో పెన్షనర్ల నిరసన

**రూ.7,500 నెలవారీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్**




**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
దేశంలో వరుస నిరసనలు తెరమీదికొస్తున్న నేపథ్యంలో ఆగస్టు 5న దేశవ్యాప్త నిరసనలకు జాతీయ పింఛనుదారుల సంఘం ఈపీఎస్95 పిలుపునిచ్చింది. ఉద్యోగ పెన్షన్ పథకం కింద నెలవారీ పింఛన్ రూ.7,500 ఇవ్వాలని.. లేదంటే ఆత్మాహుతి చేసుకోవడమే తమకున్న ఏకైక మార్గం అని పింఛనుదారుల సంఘం వెల్లడించింది.రేపు వేలాది మంది పెన్షన్‌దారులు జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతారని.. దేశ వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లోనూ నిరసనల్లో పాల్గొనాలని ఈ సంఘం కోరింది. ప్రస్తుతం నెలవారీ పింఛను రూ.1000 ఇస్తున్నారని.. 2014లో తీసుకొచ్చిన ఈ పెన్షన్ స్కీమ్‌లో సంస్కరణలు చేయాలని పింఛనుదారుల సంఘం కమాండర్ అశోక్ రౌత్ డిమాండ్ చేశారు. తాము ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేయడంలో విఫలమైందని తెలిపారు.

# నా స్కాలర్‌షిప్ వివరాలు వెల్లడిస్తా.. మరి చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా?.

**న్యూఢిల్లీ:ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
ఆర్టీఐ వివాదంపై బీజేపీపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విరుచుకుపడ్డారు. తన విద్యాభ్యాసంపై ఆర్టీఐ ద్వారా వివరాలు కోరిన నేపథ్యంలో, బీజేపీ నేతలు కూడా తమ డిగ్రీలను బహిరంగంగా వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు. తన అమెరికా చదువుకు బోస్టన్ నుంచి వచ్చిన స్కాలర్‌షిప్, ఎడ్యుకేషన్ లోన్ ద్వారా నిధులు సమకూరినట్లు దీప్కే స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ 'నా స్కాలర్‌షిప్ లెటర్, ఎడ్యుకేషన్ లోన్ పత్రాలను బయటపెట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను.



# డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఎటు?

**-ఇండియా కూటమి నుంచి నిష్క్రమించడంతో సర్వత్రా ఉత్కంఠ**

**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు రాజ్యాంగ సవరణ కోసం కొత్త బిల్లును తీసుకురావడంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన రానప్పటికీ ఒకవేళ తీసుకువచ్చిన పక్షంలో లోక్‌సభలో 22 మంది సభ్యులు, రాజ్యసభలో 8 మంది సభ్యులు ఉన్న డీఎంకే వైఖరి పైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ వివాదాస్పద బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందడం ప్రభుత్వానికి కష్టతరం కానున్నది. తమిళనాడులో విజయ్ ప్రభుత్వానికి మద్దతిచ్చి



కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి పాల్పడిందని ఆరోపిస్తూ ఇండియా కూటమి నుంచి వెలుపలకు వచ్చిన డీఎంకే రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడంపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.అయితే కొత్త బిల్లును పరిశీలించిన తర్వాతే తన ఆలోచనను బయటపెడతానని ఆ పార్టీ స్పష్టం చేసింది. తాము కాంగ్రెస్‌తో పనిచేయకపోవచ్చేమో కాని ప్రతిపక్ష పాత్రను మాత్రం వదిలిపెట్టలేదని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. వందేమాతరం బిల్లు, పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన బిల్లుపై సవరణలు ప్రతిపాదించడం ద్వారా, అలాగే వాటికి వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా తాము తమ వైఖరిని చాటుకున్నామని వారు గుర్తుచేస్తున్నారు. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ నిరసనలో భాగంగా డీలిమిటేషన్ బిల్లు ప్రతిని ఇప్పటికే దహనం చేసినందున ఆ పార్టీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయదని ఇండియా కూటమిలోని పార్టీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# భర్త కానంత మాత్రాన సహజీవన భాగస్వామిని వేధించి తప్పించుకోలేరు


**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
సహజీవనంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు సంచలన తీర్పు చెప్పింది. సహజీవనంలో కూడా భాగస్వామిని వేధింపులకు గురిచేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టంచేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నది. వివాహం కాలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది.ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం చెప్పింది. అయితే అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని



తెలిపింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అదేవిధంగా ఇలాంటి కేసుల్లో ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబసభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తుచేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొన్నది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబసభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.


# ఇస్లామిస్టులతో కలిశాక లెఫ్టిస్టులు అవుతున్నారు:

**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. దాంట్లో ఆమె తన ఫీలింగ్ వ్యక్తం చేశారు. తానొక జాగృతి చెందిన హిందువు మహిళను అని ఆమె పేర్కొన్నారు. అయితే ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత హిందూ మహిళలు కరుడుకట్టిన వామపక్షవాదుల తరహా మారుతున్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యస్త హిందువు మహిళగా ఉన్న తాను జాగృతి చెందిన హిందువుగా మారినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం కాక్రోచ్ జనతా పార్టీపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారామె. సీజేపీ ఓ మురికికాలువ అంటూ ఆమె తన ఎక్స్‌లో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా వీడియో మెసేజ్‌లో కంగనా రనౌత్ మాట్లాడుతూ.. ఒక ఫీలింగ్ షేర్ చేసుకోవాలని ఉందన్నారు. పార్లమెంట్‌కు వెళ్లడం ఆలస్యం అవుతున్నా, తన ఫీలింగ్‌ను పంచుకోవడం ముఖ్యమన్నారు.ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళల గురించి ఆమె తన



వీడియోలో ప్రస్తావించారు. అనేక మంది హిందువు మహిళలతో తనకు పరిచయం ఉందని, కానీ ఎవరికీ రాజకీయంగా కానీ, మతపరంగా కానీ చాలా వరకు మహిళల్లో అవగాహన ఉండేదికాదన్నారు. సాధారణంగా యువతలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటాయని, వాళ్లు తటస్థంటా ఉంటారన్నారు. కానీ ఇస్లామిస్టులతో పరిచయం ఏర్పడిన తర్వాత.. ఆ మహిళల్లో మార్పులు వస్తుంటాయని కంగనా అన్నారు. ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత లెఫ్టిస్టులు అవుతారని, దీంట్లో ఎటువంటి నష్టం లేదని, ఎందుకంటే రాజ్యాంగం వాళ్లకు ఆ స్వేచ్ఛ ఇచ్చిందని, మనకు కావాల్సిన ఏదైనా మతాన్ని కానీ, ఐడియాలజీని కానీ స్వీకరించవచ్చు అన్నారు. అయితే తాను ఇప్పుడు మధ్యస్థ హిందువును కాదు అన్నారు. అయితే ఇప్పుడు తనను వేధిస్తున్నారని, సంఘ్‌పరివార్‌లో ఎప్పుడు చేరానని అడుతున్నారని, ఇప్పుడు నేనొక జాగృతి పొందిన హిందువును అని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ తరహా లాంటి హిందువును అని, మార్పిడి జరగాలని కోరుతున్నానని, తానెందుకు మార్పిడి కావొద్దన్నారు. హిందువు మహిళలు ఓ నిర్దిష్ట ఐడియాలజీ ఐడెంటిటీ కోసం పోరాటం చేయాలన్నారు. మార్పిడితో చైతన్యం పొందాలని, మరి ఆ దారిని ఎందుకు మూసివేస్తున్నారని ఆమె అడిగారు.

# 'రష్యన్ అమెజాన్' వేర్‌హౌజ్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి




**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
రష్యాపై భీకర స్థాయిలో డ్రోన్లతో అటాక్ చేసింది ఉక్రెయిన్. శనివారం రష్యా చేసిన దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్ విరుచకుపడింది. అయితే వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్ ను టార్గెట్ చేసింది. రష్యాన్‌లో ఆన్‌లైన్ రిటేలర్‌గా ఉన్న వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌజ్‌పై దాడి చేసింది. దీన్ని రష్యా అమెజాన్‌గా కీర్తిస్తుంటారు. మాస్కోకు సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను డ్రోన్‌తో అటాక్ చేసినట్లు వీడియోలు రిలీజ్ అయ్యాయి. వైల్డ్ బెర్రీస్ వేర్‌హౌజ్.. రష్యాలో కీలకమైన లాజిస్టిక్ హబ్. అయితే ఆ కేంద్రాలను ఉక్రెయిన్ టార్గెట్ చేస్తున్నది. రష్యా మిలిటరీకి డ్రోన్ కాంపోనెంట్లు, నావిగేషన్ ఎక్విప్మెంట్, ఇతర సామాగ్రిని ఈ వేర్‌హౌజ్‌ల నుంచి సరఫరా చేస్తుంటారు. వైల్డ్‌బెర్రీస్ సైట్లపై ఇటీవల ఉక్రెయిన్ వరుసగా దాడి చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో కీవ్‌పై దాడి చేసింది. ఆ ఘటనలో 9 మంది మృతిచెందగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

# గాలి నుంచి సాగునీరు!..

**-అమెరికా విద్యార్థి వినూత్న ఆవిష్కరణ**

**న్యూఢిల్లీ: ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :**
ప్రపంచవ్యాప్తంగా కరువులు తరచూ సంభవిస్తున్న వేళ, అమెరికాకు చెందిన 13 ఏండ్ల విద్యార్థి రైతులకు ఉపయోగపడేలా గాలి నుంచి సాగు నీటిని ఉత్పత్తి చేసే విధానాన్ని ఆవిష్కరించాడు. బీవర్టన్‌లోని విట్‌ఫోర్డ్ మిడిల్ స్కూల్లో చదువుతున్న రాయ్ కిమ్ వాతావరణంలోని తేమను గ్రహించి దాన్ని సాగు నీటిగా మార్చే చాంబర్‌ను రూపొందించాడు. ఈ ఆవిష్కరణ 2026 3ఎమ్ యంగ్ సైంటిస్ట్ చాలెంజ్‌లో టాప్-10 నేషనల్ ఫైనలిస్ట్‌లో అతడికి చోటు దక్కేలా చేసింది.



**ఎలా పని చేస్తుంది?**
ఇది పెల్టియర్ మాడ్యూల్ సాంకేతికత ఆధారంగా పని చేస్తుంది. ఈ పరికరంలో విద్యుత్తును సరఫరా చేసినప్పుడు ఈ మాడ్యూల్ ఒక వైపు వేడిని, మరోవైపు చల్లదనాన్ని సృష్టిస్తుంది. ఈ పరికరంలోని చాంబర్‌లోకి గాలిని ప్రవేశపెట్టిన తరవాత అది కొద్దిగా వేడెక్కి తర్వాత ఫ్యాన్ సహాయంతో చల్లని ఉపరితలం వైపు నెట్టబడుతుంది. అక్కడ గాలిలోని తేమ చల్లని ఉపరితలాన్ని తాకినప్పుడు నీటి బిందువులుగా మారుతుంది. ఈ నీటి బిందువులను గరాటు ద్వారా సేకరించి వాల్వ్ ఉపయోగించి మొక్కలకు అందిస్తారు. ఈ వ్యవస్థలో నేలలోని తేమ, ఉష్ణోగ్రత, నీటి ఆవిరి సెన్సార్లు ఉన్నాయి. ఇవి గాలి ప్రవాహాన్ని ఆటోమేటిగ్గా సర్దుబాటు చేస్తాయి. మొక్కలకు ఎప్పుడు నీళ్లు అవసరమో తెలుసుకొని, అనవసర నీటి వాడకాన్ని నివారిస్తాయి.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# బీరప్ప స్వామి దేవాలయం కూల్చివేత దారుణం

**-షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**

**-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరిక**

**-వందల ఏళ్ల చరిత్ర ఉన్న బీరప్ప దేవాలయం కూల్చివేతపై ఆవేదన**

**-దేవాలయ పిల్లర్లు, స్టీల్ తొలగించడం భక్తుల మనోభావాలకు దెబ్బ**

**-సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో భూములపై అక్రమాల ఆరోపణలు**

**-భూమి అమ్మకపోయినా రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్న**

**-లేఅవుట్లకు అనుమతుల ముందు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**-ధనవంతుల మాటలు విని ప్రజలకు అన్యాయం చేయొద్దని అధికారులకు సూచన**

**-దేవాలయాలపై దాడులు సహించబోమన్న మాజీ ఎమ్మెల్యే**

**-ప్రజల్లో నమ్మకం కలిగేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో బీరప్ప స్వామి దేవాలయం నిర్మాణాలను కూల్చివేయడం పట్ల షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత వై. అంజయ్య యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి కూల్చివేసిన దేవాలయ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఆయన వెంట పాల్గొన్నారు.

దేవాలయం కూల్చివేత జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారం చేయడం తప్పు కాదని, కానీ ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురిచేసి మోసపూరితంగా భూములను స్వాధీనం చేసుకుని లేఅవుట్లు వేయడం దారుణమని అన్నారు. ఫరూక్‌నగర్ ప్రాంతంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన బీరప్ప గడ్డ, కురుమ కులస్థుల ఇష్టదైవమైన బీరప్ప స్వామి దేవాలయాన్ని కూల్చివేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పట్టపగలు దేవాలయాలను కూల్చివేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. తమ తాతలు, తండ్రుల కాలంలో నిర్మించిన దేవాలయాన్ని నేడు కూల్చివేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయానికి సంబంధించిన పిల్లర్లు, స్టీల్ సామగ్రిని కూడా దౌర్జన్యంగా తొలగించడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్య అని అన్నారు.

**వెంచర్ భూములపైనా అక్రమాల ఆరోపణలు**

సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో పలువురు రైతుల భూములను కూడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు తన దృష్టికి వస్తోందని అంజయ్య యాదవ్ ఆరోపించారు. పక్కనే ఉన్న రైతు తన భూమిని అమ్మకపోయినా, రిజిస్ట్రేషన్ చేయించకపోయినా ఆ భూమిని కూడా లేఅవుట్ చేసినట్టు ఉందని, ఇలాంటి అక్రమాలు ఎన్ని జరిగాయో అధికారులు విచారణ చేసి బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణం**

వెంచర్లకు లేఅవుట్ అనుమతులు మంజూరు చేసే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా ధనవంతులు చెప్పిన మాటలు నమ్మి ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు.

**పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి**

బీరప్ప దేవాలయం కూల్చివేత ఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయడమే కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో అసహనం, ఆగ్రహం పెరిగి ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు తలెత్తక ముందే ప్రభుత్వం, పోలీసులు స్పందించాలని కోరారు.

దేవాలయాలపై దాడులు జరిగితే ప్రజలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించిన ఆయన, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ అధికారులు కూడా సంఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం కూడా**

మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, ఈ వ్యవహారంలో న్యాయపరంగా పోరాటం చేయడంతో పాటు అవసరమైతే ప్రజా ఉద్యమాన్ని కూడా చేపడతామని స్పష్టం చేశారు. కొంతమంది రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో లేఅవుట్లు వేస్తున్నారని, ఇలాంటి అక్రమ పద్ధతుల్లో కొందరు సిద్ధహస్తులుగా మారారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. చివరగా, దేవాలయాలపైనే ఇలాంటి దాడులు జరిగితే ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతారని, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. లేదంటే సమాజంలో ఘర్షణలకు దారితీసే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ప్రభుత్వం, పోలీసులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందే బాబాయ్య, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్ ఎస్కే శివ, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, బిక్షపతి, చెర్క శివ, పాండు, సాయి తదితరులు, కుర్వ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద "సహారా మహా ధర్నా"కు పిలుపు

**కల్వకుర్తి బ్రాంచ్ మేనేజర్ రేగట్టి శ్రీనివాసులు**



**ఆమనగల్లు, ఆగస్టు03 (జర్నలిస్ట్ డైరీ) :** దేశ రాజధాని జంతర్ మంతర్ వద్ద 'మహా ధర్నా'కు పిలుపునిచ్చినట్లు కల్వకుర్తి బ్రాంచ్ మేనేజర్ రేగట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి బ్రాంచ్ మేనేజర్ రేగటి శ్రీనివాస్"నేటి దర్శిని"దినపత్రికతో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే'సహారా మహా ధర్నా'ను ఆగస్టు 5 నుండి 7వ తారీకు వరకు సహారా బాధితుల ఐక్య పోరాట కమిటీ పిలుపుమేరకు జరపనున్నామని ఆయన అన్నారు. సహారా ఇండియా పరివార్ లోని ఏజెంట్లు, కార్యకర్తలు, ఖాతాదారులు, ప్రజలు, భారీ సంఖ్యలో ఈ ధర్నాలో పాల్గొనాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సహారా బాధితుల ఐక్య పోరాట కమిటీ పిలుపుమేరకు బాధితులందరూ ఈ ధర్నాలో పాల్గొనాలని ఆయన అన్నారు. ఇది లక్షలాదిమంది బాధితుల ఆక్రందన అని, సహారా లో వయోజనులు, వృద్ధులు, చిరు వ్యాపారులు, తాము దాచుకున్న డబ్బులు తిరిగి రాక ఖాతాదారులు ఆరోగ్యరీత్యా మనశ్శాంతి కరువై ఎప్పుడు వస్తాయో అని ఆవేదన చెందుతున్నారని ఆయన అన్నారు. సహారా కేసుల విషయంలో సుప్రీంకోర్టు సత్వరమే తీర్పులు వెలువరించి, బాధితులందరికీ పూర్తి రిఫండ్ ను అందించాలని అన్నారు. ఖాతాదారుల సొమ్మును వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని దయచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహారా ఇండియా బాధితుల పక్షాన నిలబడి పోరాడాలని, సహారా బాధితులకు న్యాయం చెయ్యాలని రేగట్టి శ్రీనివాస్ అన్నారు.

## కోతుల మంద తో సతమతమవుతున్న ఆమనగల్లు పట్టణ ప్రజలు

**ప్రతిరోజు ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు**



**ఆమనగల్లు, ఆగస్టు03 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ప్రజలు నిత్యం కోతుల మంద (సమూహం)తో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా 7వ వార్డు, 9వ వార్డులో కోతుల మంద(సమూహం)తో ప్రజలు విసిగి వేసారి పోయారు. వెంకటేశ్వర కాలనీ లో వెంకటేశ్వర థియేటర్ నుండి మొదలై బస్టాండుకు అనుకొని ఉన్న ప్రభుత్వ పాఠశాల, అలాగే తెలంగాణ గ్రామీణ బ్యాంకు వెనుక భాగం లో వాసవి కన్యకపరమేశ్వరి దేవాలయం, అలాగే కస్తూరిబా పాఠశాల వరకు ఈ కోతుల బెడద నుంచి ప్రజలు, విద్యార్థులు, చిన్న పిల్లలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రాత్రి అయ్యిందంటే చాలు జనావాసాలు ఉండే ఇళ్ల పైన రాత్రి పడుకొని పొద్దున చేసే కొంటె పనులు, ఇళ్లల్లోకి దూరి మహిళలను, చిన్నపిల్లలను, బెదిరించి ఇళ్లల్లో నుండి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీలలోమహిళలు తిరగాలన్న, చిన్నపిల్లలు ఆడుకోవాలన్న భయభ్రాంతులకు లోన్ అవుతున్నారని ఆమనగల్లు లోని పలు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దయచేసి ఈ కోతుల బెడద (సమూహం) నుంచి ఆమనగల్లు పట్టణ ప్రజలను కాపాడాలని మున్సిపాలిటీ కమిషనర్ ను, మునిసిపల్ చైర్మన్ ను, ప్రజా ప్రతినిధులను, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

# తల్లిపాలు శిశువుకు తొలి టీకా..

**-జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది: డాక్టర్ స్రవంతి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు తొలి టీకా వంటివని, అవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జననం తర్వాత మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహారం అవసరం లేదని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, వాటివల్ల విరేచనాలు, నిమోనియా వంటి ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గడంతో పాటు మెదడు ఎదుగుదల, శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. అలాగే తల్లి--బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని, తల్లిపాలు పరిశుభ్రమైనవి, సరైన ఉష్ణోగ్రతలో ఉండే సహజ ఆహారమని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతరం గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడంతో పాటు తల్లి ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వీటి ద్వారా తల్లి, గర్భంలోని శిశువుకు అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్ మాట్లాడుతూ పాప పుట్టిన వెంటనే మురుపాలు తప్పకుండా పట్టించాలని, అనంతరం పిల్లలకు అన్ని వ్యాధినిరోధక టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణులు సాధారణంగా తీసుకునే ఆహారం కంటే ఎక్కువసార్లు, కొద్దికొద్దిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉండటంతో పాటు ప్రసవ సమయంలో ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్ప, ఏఎన్ఎంలు మధువాణి, లలిత, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## తల్లిపాలే నవజాత శిశువుకు శ్రీరామరక్ష

**-వీ.టి. నగర్ రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.**

**-పోషకాహారంపై అవగాహన కల్పించిన వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ పద్మ.**




**చింతపల్లి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ డైరీ) :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్ (మాల్) రెండో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ పద్మ పాల్గొని తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి ఆహారం, జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది అని అన్నారు. తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తాయని తెలిపారు. బాలింతలు పాలు, గుడ్లు తదితర పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే బాలికలకు యుక్త వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలని, తల్లి--శిశు ఆరోగ్యంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బాదేపల్లి స్వప్న, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు లావణ్య, రాధిక, ఆయా బక్కమ్మతో పాటు గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## షాద్ నగర్ తాలూకా అర్చక పురోహిత సంఘం అధ్యక్షునిగా సంబరాజు రవిశర్మ ఏకగ్రీవ ఎన్నిక



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణంలోని రామ్ మందిర్ లో నిన్న జరిగిన అర్చక పురోహిత సంఘం అధ్యక్ష సంఘం ఎన్నికలలో సంబరాజు రవిశర్మ ఏకగ్రీవంగా అర్చకులు ఎన్నుకున్నారు ఈ కార్యక్రమం బ్రాహ్మణ పెద్దలు రిటైర్డ్ ఎమ్మార్వో వెల్దండ రామారావు తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గౌరవరాజుల వెంకటేశ్వరరావు మరియు షాద్నగర్ టౌన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వావిలాల సుజీవన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి అర్చకులు పెద్ద ఎత్తున పాల్గొని గౌరవాధ్యక్షునిగా రాజశేఖర్ శర్మ మరియు అధ్యక్షునిగా రవి శర్మ ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ ను అర్చకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అతి త్వరలో కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# 4న కల్హేర్ లో గ్రంధాలయం ప్రారంభం



**నారాయణఖేడ్,ఆగస్ట్ 3 (జర్నలిస్ట్ డైరీ) :** కల్హేర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంధాలయాన్ని 4వ తేదీ మంగళవారం నాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి సోమవారం అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్యలు హాజరుకానున్నారు అన్నారు.కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

# విద్యార్థులకు విద్యాసామాగ్రీ పంపిణి



**నారాయణఖేడ్,ఆగస్ట్ 3 (జర్నలిస్ట్ డైరీ) :** ఖేడ్ మండల పరిధిలోని ఆకుల లింగాపూర్,సిర్గాపూర్ మండలంలోని వాసర్ గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎన్. టి.టి డాటా సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్,గీతా గోసంగీ మరియు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు,నోటు పుస్తకాలు,జామెట్రీ బాక్సులు తదితర విద్యాసామాగ్రి పంపిణి చేశారు.ఈ సందర్బంగా విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పోతంగల్ లో నేడు బోనాల పండుగ





**కోటగిరి / పోతంగల్ ఆగస్టు 03, (జర్నలిస్ట్ డైరీ) :** పోతంగల్ మండల కేంద్రంలో నేడు నిర్వహిస్తున్న బోనాల పండుగ మహోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలందరికీ కల్లూరు సంధ్య హన్మండ్లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయాలను పాటిస్తూ బోనాల వేడుకలను ఘనంగా జరుపుకోవాలని విజ్ఞప్తిచేశారు. అమ్మవారి ఆశీస్సులతో మన గ్రామం మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు.

# తహసీల్దార్ పనితీరుపై అసంతృప్తి



**కోటగిరి పోతంగల్ ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** పోతంగల్ మండల కేంద్రంలోని మండల తాహసిల్దార్ పనితీరుపై స్థానిక నాయకులు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం రోజున స్థానిక నాయకులు ప్రజలు తాసిల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు ధ్రువపత్రాల జారీ దరఖాస్తుల పరిష్కారం వంటి అనేక పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజెపి మండల ప్రెసిడెంట్ హన్మండ్లు రమేష్ సెట్ సజ్జత్ శివరాజ్ పటేల్ శేఖర్,గంగారం సంజీవ్ పటేల్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా దేవని శేఖర్ నియామకం

**హైదరాబాద్,ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా దేవని శేఖర్ను రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ అధికారికంగా నియమించారు. ఈ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ దేవని శేఖర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా దేవని శేఖర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, బహుజనుల హక్కుల సాధన, యువత అభివృద్ధి కోసం పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని దేవని శేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో యువతను పార్టీ వైపు ఆకర్షించి, బలమైన యువజన శక్తిని నిర్మించేందుకు కృషి చేస్తానని అన్నారు.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి యువకుడు సామాజిక బాధ్యతతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక అసమానతలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ తరపున ఉద్యమాలు నిర్వహిస్తూ,



ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర యూత్ వింగ్‌తో కలిసి సమన్వయంతో పనిచేస్తానని అన్నారు. యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించడం, రాజ్యాంగ విలువలను కాపాడడం, సామాజిక మార్పు కోసం యువశక్తిని సమీకరించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజాయితీతో, క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మిత్రులకు దేవని శేఖర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తతో కలిసి ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎస్పీఆర్' పాఠశాల అక్రమాలపై జిల్లా అధికారులకు ఉమ్మడి ఫిర్యాదు

**-చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా, విద్యార్థి సంఘాల డిమాండ్**

**-అడ్మిషన్లు నిలిపివేయాలి.. అక్రమ హాస్టల్ సీల్ చేయాలి..**

**-ఎఫ్‌టీఎల్ నిర్మాణాలపై విచారణ జరపాలని వినతి**



**చింతపల్లి/దేవరకొండ, ఆగస్టు 3 (జర్నలిస్ట్ డైరీ)** కొండమల్లేపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'ఎస్పీఆర్' (సర్వేపల్లి రాధాకృష్ణ) హైస్కూల్పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో), జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు ఉమ్మడిగా వినతిపత్రాలు సమర్పించారు.రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (RTISS) ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్, వైఎస్ఆర్ఎస్‌యూ, ఎస్‌హెచ్‌పీఎస్ తదితర సంఘాల నాయకులు పాఠశాల యాజమాన్యం చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ సంబంధిత ఆధారాలతో అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆర్‌టీఐఎస్ఎస్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్, టీఎన్ఎస్ఎఫ్ దేవరకొండ ఇన్‌చార్జ్ జార్పుల జగన్ నాయక్, వైఎస్ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎండి. సిరాజ్, ఎస్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. రమేష్ నాయక్ మాట్లాడుతూ, ఆర్‌జేడీఎస్ఈ హైదరాబాద్ ఉత్తర్వుల ప్రకారం 'ఎస్పీఆర్' పేరును ఉపయోగించేందుకు అనుమతి లేదని పేర్కొన్నారు. పేరు మార్పుకు అధికారిక అనుమతి లభించే వరకు పాఠశాలలో తరగతులు నిర్వహించడం, కొత్త అడ్మిషన్లు చేపట్టడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.

ప్రధాన డిమాండ్లుఅనుమతులు వచ్చే వరకు కొండమల్లేపల్లి బ్రాంచ్‌లో తరగతులు, అడ్మిషన్లు తక్షణమే నిలిపివేయాలి.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ హాస్టల్‌ను వెంటనే సీల్ చేసి విద్యార్థుల భద్రతను కాపాడాలి.చెరువు ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లో నిర్మించిన భవనాలపై వాల్టా చట్టం ప్రకారం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.అనుమతి లేని 'ఎస్పీఆర్' బోర్డులను తొలగించి, దేవరకొండ రోడ్డులోని బ్రాంచ్‌పైనా సమగ్ర విచారణ నిర్వహించాలి.వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతావత్ బాబురామ్ నాయక్, జార్పుల జగన్ నాయక్, ఎండి. సిరాజ్, కే. రమేష్ నాయక్తో పాటు ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దళితులకు,పేద ప్రజలకు అండగా బీజేపీ

## ఆన్మగల్ భూముల పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమం

**హయత్ నగర్, ఆగస్టు03 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్--హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో గల సర్వే నెం. 255/1లోని భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేడు సంబంధిత స్థలంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నజీవన్ రెడ్డి మాట్లాడుతూ, మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమిలో గతంలో ప్రజా అవసరాల కోసం కొంత భూమిని ప్రభుత్వం వినియోగించగా, ప్రస్తుతం మిగిలి ఉన్న సుమారు 18 ఎకరాల భూమిని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ భూములపై దశాబ్దాలుగా రైతులు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, అదే సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ జీవితకాల పొదుపుతో చిన్న చిన్న ప్లాట్లు కొనుగోలు చేసి జీవనాధారంగా చేసుకున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వమే అర్హులైన రైతులకు



పట్టాలు ఇచ్చి, ఇప్పుడు అదే భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం ప్రజల హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. ఒకవైపు “ఇందిరమ్మ ఇల్లు” పేరుతో పేదలకు ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెబుతుంటే, మరోవైపు పేదలు కొనుగోలు చేసిన ఇంటి స్థలాలనే లాక్కోవాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు పేదల భూములను స్వాధీనం చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే దిశగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఆన్మగల్ ప్రాంతంలోని రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేసిన నాయకులు, ప్రభుత్వం వెంటనే భూముల స్వాధీనం ప్రక్రియను విరమించి బాధితులకు పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థులు, రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి పేదల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్లాట్ల యజమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నీటిని విడుదల చేసి పంటలను కాపాడండి



## మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్

**నారాయణఖేడ్, ఆగస్టు 03 (జర్నలిస్ట్ డైరీ) :** సిర్గాపూర్ మండలంలోని సుల్తానాబాద్ లో గల ఏకైక ప్రాజెక్ట్ నల్లవాగు నుండి ఆయకట్టు పంటలకు నీటిని విడుదల చేసి రైతులను కాపాడాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ..ప్రాజెక్టులో నీటిమట్టం 89 లెవెల్కు చేరుకున్నప్పటికీ ఇప్పటి వరకు సాగునీటిని విడుదల చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.నల్లవాగు ప్రాజెక్టు కింద ఉన్న వేలాది ఎకరాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని,నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం దారుణం అన్నారు.ఈ విషయమై సంబంధిత డీఈతో ఫోన్లో మాట్లాడి, ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యేకు సాగునీటి అవసరాలపై సరైన అవగాహన లేకపోవడంతోనే నీటి విడుదల ఆలస్యం అవుతోందని విమర్శించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించామని,రైతులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసేవాళ్లమని,నేడు నీరు అందుబాటులో ఉన్నా విడుదల చేయక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అన్నారు.ఎరువుల సరఫరాలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత నెలకొన్నప్పటికీ రైతులకు సకాలంలో అందించే చర్యలు తీసుకోవడం లేదన్నారు. యూరియా కోసం రైతులు షాపుల చుట్టూ తిరుగుతున్నారని, షాపుల్లో లేని యూరియా యాప్లలో దొరుకుతుందా?అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతుల వద్ద స్మార్ట్ఫోన్లు లేకపోవడం, ఉన్నవారిలో కూడా యాప్ల వినియోగంపై అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.దూర ప్రాంతాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవాల్సి రావడంతో రవాణా ఖర్చు కూడా రైతులపై అదనపు భారంగా మారిందన్నారు. అందువల్ల యాప్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా, ప్రతి గ్రామానికి సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) మరియు ఎరువుల విక్రయ కేంద్రాల్లో తగినంత యూరియాను నిల్వ ఉంచి రైతులకు సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై స్పందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా రాజకీయాలను పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడంతో పాటు ఎరువుల కొరతను నివారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.గతమా ప్రభుత్వంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని,ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 12 గంటలు కూడా సరిగా కరెంట్ రావడం లేదని, నాణ్యమైన కరెంటు లేక మోటార్లు కాలీ పోతున్నాయని,సకాలంలో నాణ్యమైన విద్యుత్ 24 గంటలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి,మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు రామ్ సింగ్,సర్పంచులు మారుతి,సంగన్న,పిఏసిఎస్ చైర్మన్ కృష్ణ గౌడ్ వైస్,రామ్ రెడ్డి,నాయకులు పండరి,గోపాల్ రెడ్డి, సాయగౌడ్, నారాయణ,కృష్ణ గౌడ్,భూషణం, సాయిలు,పార్టీ సీనియర్ నాయకులు కిషన్ రెడ్డి, నారాయణ, జనార్ధన్,వీరేశం,పండరి, మహబూబ్, కాజా, ప్రశాంత్ సాగర్, ప్రమోద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానం పై ప్రజల్లో అవగాహన కల్పించాలి: కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 3 (జర్నలిస్ట్ డైరీ) :** అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ . సత్య శారదా దేవి అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ అవయవ దాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్ జరిగిన తర్వాత అవయవ దానం చేసి ప్రాణాలు కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనం కలెక్టర్లు సంధ్యారాణి, గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి ,అసోసియేషన్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

## విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు వైద్యులు అందించాలి: ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఆగస్టు 3 (జర్నలిస్ట్ డైరీ) :** అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వర్ధన్నపేట ఎస్టీ ట్రైబల్ హాస్టల్ విద్యార్థులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ పరామర్శించారు.వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల హాస్టల్ విద్యార్థినులు ఆస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే వర్ధన్నపేట ఏరియా హాస్పిటల్ కి వెళ్ళి పరామర్శించి,వారికి ధైర్యాన్నిచెప్పారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంబాధాకరమన్నారు.వైద్యులు వెంటనే స్పందించి విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యంఅందించారన్నారు. విద్యార్థినులకు మెరుగైనవైద్యసేవలుఅందించాలని, అంతేకాకుండా పూర్తి స్థాయిలో కోలుకునే వరకు వైద్యులు నిరంతరం పర్యవేక్షించాలని ఆసుపత్రి వైద్యాధికారులను ఎమ్మెల్యేఆదేశించారు. కలెక్టర్,ఉన్నతాధికారులతో మాట్లాడి సంఘటనకు గల కారణాలను తెలుసుకొని, వాటిని పరిష్కరించి భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలుచేపడతామన్నారు.త్వరలో హాస్టల్ ను సందర్శించి అవసరమైన వసతులను పరిశీలించి అధికారులతో మాట్లాడి విద్యార్థినులకు అండగాఉంటామన్నారు. ఎవరికి ఎలాంటి హాని కలగలేదని,రాత్రి లేదా ఉదయం వరకు కోలుకుంటారని వైద్యులు చెప్పారని,విద్యార్థినుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి వారికి మనోధైర్యాన్ని కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ఆయుబ్,మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, నియోజకవర్గ, మండల,గ్రామ ముఖ్య నాయకులు,కౌన్సిలర్లు,సర్పంచులు,నాయకులు, కార్యకర్తలు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ వారసత్వ పరిరక్షణ,అభివృద్ధి పై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**ఉమ్మడి వరంగల్, ఆగస్టు3 (జర్నలిస్ట్ డైరీ)** వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రధానంగా వరంగల్కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత--హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలోఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



మాట్లాడుతూవరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్కు గుర్తింపు లభించినప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు.ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రంరూపొందించాలన్నారు. కాకతీయుల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక సాంస్కృతిక, పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు.

వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మధ్య ఒప్పందం కుదరడం స్వాగతించదగ్గ విషయమని, అయితే పనులు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సూచించారు.కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతాను" అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# ఒక్క క్షణం పరధ్యానం... జీవితానికే ఎండ్కార్డ్: రోడ్డు ప్రమాదాలపై ఎస్ఐ వెంకన్న



**గుర్రంపోడు, ఆగస్టు03, (జర్నలిస్ట్ డైరీ) :** గుర్రంపోడు పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులకు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న, రోడ్డు భద్రత విభాగ అధికారి రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారానే ప్రమాదాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనదారులు 'ఆర్ఆర్ఆర్' సూత్రాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ 'ఆర్ఆర్ఆర్' లో మొదటి ఆర్ – రోడ్డు భద్రత అని, ప్రయాణాల్లో భద్రత అత్యంత ముఖ్యమని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. రెండవ ఆర్ – నియమాలు అని, ట్రాఫిక్ సిగ్నల్స్, వేగ పరిమితులు మరియు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మూడవ ఆర్ – బాధ్యతలు అని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు మన ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను కూడా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, అతి వేగం, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వాహనదారులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో రైతుకు దీర్ఘకాలిక ఆదాయం గడియ గౌరారంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్కు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బాలు నాయక్

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం -- ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధ్యం.

**చింతపల్లి, ఆగస్టు 3 (జర్నలిస్ట్ డైరీ) :** నల్లగొండ జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం గడియ గౌరారం ఎక్స్ రోడ్ వద్ద రైతు అల్వాల యాదయ్య పొలంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆయిల్ ఫామ్ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం అందించే లాభదాయక పంటగా ఆయిల్ ఫామ్ నిలుస్తుందన్నారు. వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు.నాణ్యమైన మొక్కల పంపిణీ, సాంకేతిక సలహాలు, సాగు నిర్వహణకు అవసరమైన మార్గదర్శకాలను ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు అడుగులు వేస్తే



భవిష్యత్తులో ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, గిట్టుబాటు ధరలు, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.దేవరకొండ నియోజకవర్గంలో వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ అవకాశాలు ఉన్న ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల గిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జటావత్ హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# బిజినెస్

## జియో బంపరాఫర్.. రూ.400తో సరికొత్త ప్యాకేజ్!




రిలయన్స్ జియో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సరికొత్త జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్, హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాన్‌లను ప్రారంభించింది. ఈ ప్లాన్‌లు నెలకు రూ. 400 ప్రారంభ ధరతో హై-స్పీడ్ వైఫై, 1,000కి పైగా లైవ్ టీవీ ఛానెల్‌లు, 12-ప్లస్ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల సబ్‌స్క్రిప్షన్‌లను అందిస్తాయి. ఈ బండిల్ ఆఫర్ ద్వారా కస్టమర్‌లు బ్రాడ్‌బ్యాండ్, టెలివిజన్, స్ట్రీమింగ్ వినోదాన్ని ఒకే కనెక్షన్, బిల్లుతో పొందవచ్చు. ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా ప్రతికూల వాతావరణంలోనూ అంతరాయం లేని సేవలు, లైవ్ టీవీని పాజ్, రివైండ్ చేసే సదుపాయం కూడా ఉన్నాయి.

### ఫ్లిప్‌కార్ట్ ప్లస్ యూజర్లకు
## ఉచిత నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్!




ఫ్లిప్‌కార్ట్, నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి తన ప్లస్ మెంబర్లకు ఉచిత నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్ సబ్‌స్క్రిప్షన్‌ను అందిస్తోంది. ఈ ఆఫర్ పొందడానికి, ఒకే క్యాలెండర్ నెలలో ఫ్లిప్‌కార్ట్, గ్రాసరీ లేదా మినిట్స్ ద్వారా కనీసం రూ. 299 విలువైన 4 విజయవంతమైన ఆర్డర్‌లను పూర్తి చేయాలి. 4వ ఆర్డర్ పూర్తయిన తర్వాత, ఫ్లిప్‌కార్ట్ యాప్‌లోని 'మీ Account > Plus విభాగంలో ఉచిత నెట్‌ఫ్లిక్స్ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.

## సోమవారం బంగారం ధరల్లో మార్పులు.. కొనుగోలుదారులు అప్రమత్తం

వారారంభమైన సోమవారం దేశీయ బంగారం మార్కెట్లో ధరల్లో స్వల్ప మార్పులు నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరల హెచ్చుతగ్గులు, డాలర్ మారకం విలువ, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు కదలిక చూపించాయి. తాజా మార్కెట్ సమాచారం ప్రకారం, 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు సుమారు 13,250, 24 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు 13,900--?14,300 మధ్య కొనసాగుతోంది. నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, అమెరికా వడ్డీ రేట్ల అంచనాలు, ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా బంగారం ధరలు సమీప రోజుల్లో కూడా ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు తాజా ధరలను పరిశీలించి, హాల్‌మార్క్ ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని జువెలరీ వ్యాపారులు సూచిస్తున్నారు.



## రూ.5 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద..

**-వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాలు**



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ తో చర్చలు ఉంటాయని ప్రకటించడంతో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు చల్లారాయి. దాంతో చమురు ధరలు మరోసారి దిగొచ్చాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. దాంతో సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,094.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, టాటాస్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# స్పోర్ట్స్

## రహానే రిటైర్మెంట్‌తో మొదలైన చర్చ..


**-భారత క్రికెట్‌కు మరో ఐదుగురు సీనియర్లు గుడ్‌బై చెప్పనున్నారా?**



టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత క్రికెట్‌లో కొత్త చర్చ మొదలైంది. గత కొన్నేళ్లుగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న రహానే, ఇకపై అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నిర్ణయం తర్వాత జట్టుకు దూరంగా ఉన్న మరికొందరు సీనియర్ ఆటగాళ్లు కూడా త్వరలోనే రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఒకప్పుడు భారత టెస్ట్ జట్టుకు కీలక బ్యాటర్‌గా, వైస్ కెప్టెన్‌గా సేవలందించిన అజింక్య రహానే గత మూడేళ్లుగా జాతీయ జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించినప్పటికీ సెలెక్టర్లు అవకాశాలు ఇవ్వకపోవడంతో చివరికి అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు. రహానే నిష్క్రమణతో భారత క్రికెట్‌లో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు టీమిండియా స్వింగ్ స్పెషలిస్ట్ భువనేశ్వర్ కుమార్ ఇప్పటికీ దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో మంచి ప్రదర్శనలు చేస్తూనే ఉన్నాడు. ఇటీవల జరిగిన సీజన్‌లోనూ కీలక వికెట్లు తీసి తన అనుభవాన్ని మరోసారి నిరూపించాడు. అయినప్పటికీ భారత జట్టులో అవకాశాలు లేకపోవడంతో అతని భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భువీ కూడా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.సుదీర్ఘకాలం భారత పేస్ దళానికి నాయకత్వం వహించిన ఇషాంత్ శర్మ కూడా జాతీయ జట్టుకు చాలా కాలంగా దూరంగా ఉన్నాడు. చివరిసారిగా భారత్ తరపున మరో మ్యాచ్ ఆడి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించాలని భావిస్తున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అవకాశం దక్కే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఆయన కూడా త్వరలోనే అధికారికంగా వీడ్కోలు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. టెస్ట్ క్రికెట్‌లో భారత్ తరపున ట్రిబుల్ సెంచరీ సాధించిన అరుదైన బ్యాటర్లలో ఒకడైన కరుణ్ నాయర్‌కు కూడా జట్టులో అవకాశం దక్కడం లేదు. చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చినా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోవడంతో మళ్లీ జట్టుకు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని రీఎంట్రీ అవకాశాలు కూడా చాలా స్వల్పంగానే కనిపిస్తున్నాయి. మరోవైపు ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ కూడా యువ ఆటగాళ్ల రాకతో తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాడు. కొత్త తరానికి ప్రాధాన్యం పెరగడంతో అతని అవకాశాలు తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో శార్దూల్ కూడా తన భవిష్యత్తుపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కూడా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నప్పటికీ అతడికి అవకాశాలు రాకపోవడంతో అభిమానుల్లోనూ చర్చ మొదలైంది. రహానే రిటైర్మెంట్ అనంతరం భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్, మహమ్మద్ షమీ భవిష్యత్తుపై ప్రచారం జోరుగా సాగుతున్నప్పటికీ, వీరిలో ఎవరూ ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించలేదు. రానున్న రోజులలో ఏం జరగనుందో చూడాల్సి ఉంది.

## చెడు భాషను వాడకండి..

**-యువతకు మనూ భాకర్ సందేశం**



**న్యూఢిల్లీ:**
ఒలింపిక్ షూటర్ మనూ భాకర్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ మెసేజ్ పోస్టు చేశారు. చెడు భాష గురించి ఆమె తన మెసేజ్‌లో యువతకు సందేశం ఇచ్చారు. చెడుగా మాట్లాడడం మానుకోవాలని ఆమె యువతను కోరారు. తిట్టుకోవడం, దుర్భాషలాడడం .. మంచి పద్ధతి కాదు అని ఆమె అన్నారు. మీరు మాట్లాడే మాటలే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్.. తన ఎక్స్ అకౌంట్‌లో సుదీర్ఘ సందేశాన్ని పోస్టు చేశారు. మీ భాషే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని, మీరెలాంటి వాళ్లో చెబుతోందని, మీ పదాలను తెలివిగా ఎంచుకోవాలని, ఎందుంటే మీరు అనుకున్నట్లే మీరు తయారు అవుతారన్నారు.చెడు భాషను వాడడం మంచి పద్ధతి కాదు అని, దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. అలా చేస్తే నిర్మలంగా ఉండలేరన్నారు. కూల్‌గా ఉండడం అంటే హార్డ్ వర్క్ చేయడమే అని, దయతో ఉండాలని, ఇతరుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు. మంచితనంతో విజయం సాధించాలన్నారు. మీ పేరెంట్స్, దేశాన్ని గర్వంగా నిలపాలన్నారు. ఈ విషయాన్ని మీకెందుకు చెబుతున్నానంటే, గత కొన్నేళ్ల నుంచి .. చెడు భాషను వాడుతున్న తీరు మారిందన్నారు. చాలా మంది చాలా సాదాసీదాగా చెడు మాటలు మాట్లాడుతున్నారని, దాన్నే కూల్‌గా భావిస్తున్నారని, రోజువారీ మాటల్లో అమర్యాదకర భాషను వాడుతున్నట్లు షూటర్ మనూ భాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తిట్టడం అంటే కూల్‌గా ఉండడం కాదన్నారు.

## ఈశాన్య రాష్ట్రాల్లేకుండా భారత చిత్రపటం..

**-గ్లాస్గోలో రెస్టారెంట్ తీరుపై లవ్లీనా అసంతృప్తి**




**గ్లాస్గో**
కామన్వెల్త్ క్రీడలు జరుగుతున్న స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గోలో గల భారత సంతతి రెస్టారెంట్ ఒకటి దేశ చిత్రపటాన్ని తప్పుగా ముద్రించి విమర్శల పాలైంది. ఈశాన్య రాష్ట్రాల్లేకుండానే పటాన్ని అంసపూర్తిగా ముద్రించడం వివాదాస్పదమైంది. వివరాల్లోకెళ్తే.. ఈ క్రీడల్లో ఏకంగా ఏడు స్వర్ణాలతో సత్తాచాటిన భారత బాక్సింగ్ బృందం తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు గాను స్థానికంగా ఉన్న 'మిస్టర్ సింగ్స్ ఇండియా ది హోమ్ ఆఫ్ కర్రీ' అనే రెస్టారెంట్‌కు వెళ్లింది. అక్కడ నిర్వాహకులు బాక్సర్లకు భారత చిత్రపటం ఉన్న న్యాప్‌కిన్‌లు ఇచ్చారుఅయితే వాటిపై ఈశాన్య రాష్ట్రాలు లేవని గుర్తించిన లవ్లీనా బోర్గోహెయిన్ నిర్వాహకులను ఉద్దేశిస్తూ.. 'మీరు దీనిని తప్పుగా అనుకోకండి. ఈ మ్యాప్‌లో నార్త్ ఈస్ట్ మిస్ అయింది. హోటల్ ముందు బోర్డులోనూ ఇలాగే ఉంది. ఒక నార్త్ ఈస్ట్‌గా నాకు ఇది చాలా బాధ కలిగించింది. భారత్‌లో ప్రతి ప్రాంతం ముఖ్యమైనదే. మళ్లీ ఇలా జరుగకుండా చూసుకోండి' అని తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. అక్కడే ఉన్న బాక్సింగ్ కోచ్ అజయ్ సింగ్ సైతం.. నార్త్ ఈస్ట్ మాత్రమే కాదు, అందులో జమ్మూకాశ్మీర్‌నూ తప్పుగా ముద్రించారని అన్నాడు. కాగా దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో హోటల్ నిర్వాహకులు తమ తప్పును సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చినట్టు అజయ్ సింగ్ తెలిపారు.

# 'అగధ' ట్రైలర్ విడుదల..

**-మంత్ర తంత్రాల రహస్యాలతో ఉత్కంఠ రేపుతున్న ఎంఎస్ రాజు!**




ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. "మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది... దాని గురించి నాకు తెలియాలి" అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'అగధ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.




# ఈ ఏడాది కాలం నాకు నేర్పింది అదే



నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ 'ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుందిఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.




# ఓటీటీలోనూ 'దీవానా' దూకుడు..

**-50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాల మైలురాయి చేరుకుందిగా!**

థియేటర్లలో మంచి ఆదరణ పొందిన చిత్రం దీవానా. యువ నటులు హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై ప్రధాన పాత్రల్లో రూపొందిన 'దీవానా' చిత్రం ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఇటీవల స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను సొంతం చేసుకుంటూ అరుదైన రికార్డును నమోదు చేసింది.ఆహాలో విడుదలైనప్పటి నుంచి 'దీవానా' ఏకంగా 50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలు పూర్తి చేసి మరో మైలురాయిని అందుకుంది. థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకుల మన్ననలు కూడా పొందుతుండటం విశేషం. మంచి కథ, భావోద్వేగాలు, వినోదం కలగలిసిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని ఓటీటీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై జంటగా నటించగా, ప్రముఖ నటులు నరేష్ విజయ్ కృష్ణ, ఝాన్సీ, బలగం వేణు, జీవన్ కుమార్, టోనీ కీలక పాత్రల్లో కనిపించి కథకు బలాన్నిచ్చారు. వీరి నటన కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దీవానా' చిత్రాన్ని వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మించారు. గీతా ఆర్ట్స్, వి స్టూడియోస్, అర్హా మీడియా బ్యానర్లపై రూపొందిన ఈ సినిమాకు ఈశ్వర్ చంద్ర సంగీతాన్ని అందించారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చాయి. థియేటర్ల తర్వాత ఓటీటీలో కూడా ఇలాంటి అద్భుతమైన స్పందన రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. రానున్న రోజుల్లో 'దీవానా' మరిన్ని స్ట్రీమింగ్ రికార్డులు సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.మరి మీరు ఈ సినిమాని మీరు ఇప్పటివరకు చూడకపోతే ఓ లుక్కేయండి మరి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465